క్లుప్తంగా

ప్రజా ధనాన్ని వృథా చేయవద్దు



నగరంపాలెం: ప్రజా ధనాన్ని వృథా చేయవద్దని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీవీ కుమార్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా విజిలెన్స్ ఎస్పీ ఈశ్వరరావు ఆదేశాల మేరకు జీఎంసీ పరిధిలోని 57వ నంబర్ సచివాలయంలో మంగళవారం జీఎంసీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, సచివాలయ కార్యదర్శులతో 'అవినీతికి నో చెప్పండి.. దేశానికి అంకితం కండి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన కేవీవీ కుమార్ మాట్లాడుతూ పౌర సేవలను ప్రజల అందరికి నాణ్యత ప్రమాణాలతో అందించాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా పంపిణీ పథకాలను సక్రమంగా అందజేయాలని అన్నారు. విజిలెన్స్ విధి విధానాలు, అవగాహన వారోత్సవాల నిర్వహణపై ఆయన వివరించారు. సదస్సులో వివిధ విభాగాల ఈఈలు కొండారెడ్డి, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణను ఆపేయాలి

లక్ష్మీపురం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణని తక్షణమే ఆపేయాలని పౌరుల హత్యలు దమన కాండకు ముగింపు పలకాలని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య విజ్ఞప్తి చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం విద్యావేత్తలు, విశ్లేషకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గాజాపై ఇజ్రాయెల్ దళాలు తీవ్రస్థాయిలో దాడులు జరుపుతున్నాయని, ఇప్పటికే పాలస్తీనాలో మృతుల సంఖ్య 8వేలకు పైగా చేరిందన్నారు. అమాయక ప్రజలు, ముక్కుపచ్చలారని చిన్నారులు ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోవడం ప్రపంచాన్ని కలచి వేస్తుందన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రవి బాబు, సంస్థ సీనియర్ సభ్యులు చంద్రయ్య ప్రసంగించారు.

పురుగుమందు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: అనుమతి లేకుండా పురుగుల మందు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు అయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటుకూరు రోడ్డులోని విష్ణుప్రియ కాంప్లెక్సులో కోటపాటి కోటేశ్వరరావు ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా పురుగు మందులతోపాటు, పలు ద్రావకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అగ్రికల్చర్ అధికారి పి.కిషోర్ తనిఖీ చేశారు. అనుమతులు లేని పలు పురుగుల మందులు స్వాధీనం చేసుకుని కిషోర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కలిగిఉన్న పలువురి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులతో పాటు, విక్రయించిన మరో ఇద్దరిని అరండల్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు రెండు రోజుల క్రితం అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి సుమారు వంద గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, విచారించి వారికి గంజాయి విక్రయించిన మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చంద్రమౌళినగర్ 5వ లైనుకు చెందిన శివరాత్రి శ్రీనివాస్(20) సోమవారం మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడిని మద్యం తాగవద్దని మందలించారు. మనస్తాపం చెందిన శ్రీనివాస్ తాను పనిచేసే టీస్టాల్‌లోని ఓ గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేత

శలపాడు(చేబ్రోలు): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం కావడంతో బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, నగదు సహాయాన్ని మంగళవారం అందజేశారు. సోమవారం రాత్రి నిర్వహించిన అగ్ని ప్రమాదంలో పులి అంకమ్మస్వామికి చెందిన పూరిల్లు, గడ్డివామి కాలిబూడిదైంది. సుమారు రూ.లక్షన్నర ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదంలో పశువులు, ఆవులకు స్వల్ప గాయాలవటంతో పశువైద్యశాఖ సిబ్బంది వైద్య సేవలు అందజేశారు. ప్రమాద బాధిత కుటుంబాన్ని తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి నగదు ఆర్థిక సహాయం, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందే సహాయ సహకారాలను త్వరతగతిన అందే విధంగా కృషి చేయనున్నట్లు నాయకులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మన్నెం వేణుగోపాలరావు, ఉయ్యూరు బాలచంద్రయ్య పాల్గొన్నారు.

'మత్తు' వదిలిస్తున్నారు

- జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు
- బాధితులకు ఉచిత వైద్యం



జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్

గుంటూరు మెడికల్: 'గుంటూరు నగరానికి చెందిన సుబ్బారావు మార్కెటింగ్‌లో పీజీ పూర్తి చేసి సొంతంగా వ్యాపారం పెట్టుకున్నాడు. స్నేహితులు, తోటి వ్యాపారుల స్నేహంలో పడిపోయి మద్యానికి అలవాటు పడ్డాడు. వ్యాపారంలో నష్టపోయి దివాళా తీసే పరిస్థితికి వచ్చాడు. తన వ్యసనం వల్లే తాను అన్ని విధాలా నష్టపోయినట్లు నిర్ధారించుకుని గుంటూరు జీజీహెచ్ డీ అడిక్షన్ సెంటర్‌లో వైద్యులను సంప్రదించాడు. వైద్యులు ఆరు నెలలుగా ఉచితంగా సేవలందించారు. ప్రస్తుతం మద్యం వ్యసనం నుంచి బయట పడి తన వ్యాపారాన్ని చక్కదిద్దుకునే పనిలో సుబ్బారావు ఉన్నాడు.' ఇలా ఎంతో మంది వివిధ కారణాలతో వివిధ రకాల రూపాల్లో మత్తు పదార్థాలు తీసుకోవడానికి అలవాటు పడిన వారినిరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని డీ అడిక్షన్ సెంటర్ కొండంత అండగా నిలబడి పూర్తిగా వారిని మత్తు నుంచి విముక్తుల్ని చేస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో వైద్య సేవలు అందిస్తున్నారు.

ప్రభుత్వ సంకల్పంతో..

మత్తుకు బానిసలుగా మారిన వారిలో పరివర్తన తెచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మద్యం, ఇతర మత్తు వ్యసనాల నుంచి విముక్తి చేసి ఉచితంగా వైద్యం అందించే డీ అడిక్షన్ కేంద్రాలను 2020లో ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో డీ అడిక్షన్ కేంద్రం(వ్యసన విమోచన కేంద్రం) అందుబాటులో ఉంది.

15 పడకలతో ప్రత్యేక విభాగం...

గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో 15 పడకలతో డీ అడిక్షన్ సెంటర్‌ను(వ్యసన విమోచన కేంద్రం) ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మద్యం, చుట్ట, బీడీ, సిగిరెట్లు, పొగాకు పదార్థాలను నమలటం, గుట్కా, జర్దా, గంజాయి, హెరాయిన్, మత్తు బిళ్ళలు, పేకాట, మట్కా, పిచ్చిమందులు తీసుకోవటం లాంటి వ్యసనాలకు అలవాటు పడిన వారికి ఈ కేంద్రంలో ప్రతిరోజూ ఉచితంగా వైద్యసేవలను అందిస్తున్నారు. మత్తుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వటం, మందులు ఇవ్వటం చేస్తున్నారు. ఒక్కో బాధితుడికి సుమారు రూ. 30వేలకు పైగా ఖరీదు చేసే వైద్య పరీక్షలు మందులు, చికిత్స అన్ని ఉచితంగా అందిస్తున్నారు.

ప్రత్యేక వైద్య సిబ్బంది

ఈ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాచవరపు మాధురి ప్రియ, కౌన్సిలర్లు రవికుమార్, అనూష, సరోజిని, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జీజీహెచ్ మానసిక వ్యాధుల ఓపీ విభాగం 21వ నంబరు గదిలో మత్తు అలవాటును విడనాడాలనుకునేవారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు.

చికిత్స పొందిన వారి వివరాలు

గుంటూరు జీజీహెచ్ డీ అడిక్షన్ కేంద్రంలో గంజాయి, సిగరెట్, మద్యపానం, ఇతర అలవాట్లతో బాధపడుతూ 2020లో 343 మంది, 2021లో 1406 మంది, 2022లో 4,589 మంది, 2023 సెప్టెంబరు వరకు 3,851 మంది చికిత్స పొందారు.

బాధితుల్లో మార్పు తెస్తున్నాం...



మద్యం, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించటం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావొచ్చు. బాధితుల కుటుంబ సభ్యులకు ఇంట్లో బాధితులతో ఎలా మసలుకోవాలో వివరిస్తాం. మత్తుకు బానిసలవుతున్నవారిలో 15 నుంచి నుంచి 30 సంవత్సరాల వారు ఎక్కువగా ఉంటున్నారు. ఈ వయస్సువారిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, డీ అడిక్షన్ సెంటర్ నోడల్ ఆఫీసర్, గుంటూరు జీజీహెచ్

ప్రాథమిక లక్షణాలతో గుర్తించాలి



పాఠశాల వయసులోనే విద్యార్థులు గంజాయి, స్మోకింగ్, ఆల్కహాల్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడడం చాలా బాధాకరం. ఆకస్మాత్తుగా స్కూల్‌కు వెళ్లకుండా మానివేయడం, ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లడం, అడిగినా ఎక్కడికి వెళ్లింది సమాచారం చెప్పకుండా ఉండటం, చేస్తారు. కళ్లు ఎర్రబడడం, నోరు ఎండిపోవడం, పరధ్యానంగా ఉండటం, కట్టలు తెగే కోపాన్ని ప్రదర్శించడం, తరచూగా గొడవల్లో మునిగిపోవడం, ఇంట్లో డబ్బులు తీసుకుని వెళ్లిపోవడం లాంటి లక్షణాలు పిల్లల్లో గమనిస్తే తక్షణమే మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని గుర్తించి వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలి.

– డాక్టర్ మాచవరపు మాధురి ప్రియ, మెడికల్ ఆఫీసర్

మాతృ మరణాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: మాతృ మరణాలు సంభవించకుండా గర్భం దాల్చింది మొదలు, కాన్పు వరకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం మాతృ మరణాల సర్వైలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ సర్వైలెన్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణి రక్తహీనతకు గురికాకుండా, మధుమేహం, రక్తపోటును నియంత్రణలో ఉండేలా కాన్పు అయ్యేంతవరకు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లాలో సెప్టెంబరు నెలలో జరిగిన, గుంటూరు పట్టణంలోని ఐపీడీ కాలనీకి చెందిన ఒక మాతృ మరణానికి గల కారణాలను, కమిటీ సభ్యులు సమీక్షించారు. రక్తపోటుతో గర్భిణి ఎక్కువ కాలం బాధపడిందని, గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యే వరకు ప్రతి గర్భిణిని, ఆరోగ్య కార్యకర్తలు సూపర్‌వైజర్లు, వైద్యాధికారి పర్యవేక్షిస్తూ ఉండాలని కమిటీ అభిప్రాయపడింది. గుంటూరులో మాతృ మరణం పూర్తిగా నివారించదగినదని కమిటీ పేర్కొంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ సుస్మిత, గైనకాలజిస్ట్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, మత్తు వైద్య నిపుణులు రాధికారాణి, డీపీఎంఓ చుక్కా రత్న మన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ అన్నపూర్ణ, డీపీహెచ్ఎన్‌ఓ కే శాంతకుమారి, డెప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉనికి కోసం టీడీపీ పాట్లు

పొన్నూరు: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర తన ఉనికిని చాటుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాలు లేనప్పటికీ పంటలకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం పంట భూ ములకు నీటి కొరత లేదని, కాలువల్లో నీరు పుష్కలంగా ఉందని, కాలువ చివరి భూముల వరకు నీరు అందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే రోశయ్యను కించపరిచే విధంగా వ్యాఖ్యలు, నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని నరేంద్ర ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు షేక్ అల్లా బక్షు, పార్టీ రూరల్ అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు లింగం మనోహర్, వేముల మూర్తి రాజు, దేవరకొండ గోపి, గోపిశెట్టి వాసు, నాగిశెట్టి నరసింహ పాల్గొన్నారు.

వివాలో ఫిట్ ఇండియా 4కే పరుగు



4కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: విద్యార్థులు సోదర భావంతో ముందుకు సాగుతూ సమైక్యతను చాటాలని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వివా ది స్కూల్‌లో మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని 4కే నాలుగు కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగు పందెం నిర్వహించారు. వివా ప్రాంగణం నుంచి గోళ్లమూడి గ్రామం మీదగా పరుగుపందెం సాగింది. వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వ్యాయామం, పరుగును ప్రతిరోజు దినచర్యలో భాగంగా చూసుకోవాలని సూచించారు.

ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళి

పెదకాకాని: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని లూథర్‌గిరికాలనీలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కంతేటి యలమందరావు మాట్లాడుతూ ఇందిరా బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. పేదలకు ఐదు సెంట్లు ఇంట స్థలం మంజూరు చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతోందన్నారు.

రాజ్యాంగం కల్పించిన సమానత్వం ఐక్యతకు పునాది

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: రాజ్యాంగంలో పొందుపరిచిన సమాన హక్కులు దేశ ఐక్యతకు పునాది అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) గుంటూరు ఫీల్డ్ కార్యాలయ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశ ఐక్యతకు భంగం కలిగించే ఎటువంటి ప్రయత్నం ఎవరు చేసినా రాజ్యాంగం ప్రజలందరికీ ఇచ్చిన సమాన హక్కులు, శక్తితో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సీబీసీ గుంటూరు ఫీల్డ్ అధికారి రమేష్‌చంద్ర మాట్లాడుతూ దేశ ఐక్యత పరిరక్షణ, ఆర్థిక పురోభివృద్ధి బాధ్యత జనాభాలో సగభాగంగా ఉన్న యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కేంద్ర వైద్య సర్వీసుల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టీసిహెచ్ కోటేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గోపీచంద్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఐక్యతా ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ ఐక్యతా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమైక్యత దేశ రక్షణకు కవచం వంటిదని, దీనిని సాధించేందుకు ప్రతి ఒక్కరూ దేశభక్తితో నడుచుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు గుజ్జనగుండ్ల కూడలి వరకు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి పాల్గొన్నారు.

భారత ఐక్య వారధి సర్దార్ పటేల్

లక్ష్మీపురం:సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్ప దేశభక్తుడు, భారత ఐక్యత వారధి అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పటేల్ జయంతిని మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత సాంఘింక సంక్షేమ శాఖ అధికారి వి.జోస్లిన్ పాల్గొన్నారు.

దేశ ఐక్యత ప్రతి ఒక్కరి బాధ్యత

నెహ్రూనగర్: దేశ ఐక్యత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుంటూరు జిల్లా నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్రం గుంటూరు ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతోత్సవ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పటేల్ దేశాన్ని సమైక్యంగా నిలబెట్టిన మహనీయుడని కొనియాడారు. జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్(డి.టి.సి.ఓ.) డాక్టర్ డి.శ్రీనివాసులు మాట్లాడుతూ సర్దార్ పటేల్ దృఢ సంకల్పం స్ఫూర్తితో కుటుంబమైనా, సమాజమైనా, దేశమైనా ప్రతి దశలోనూ ఐక్యత అవసరమన్నారు. అనంతరం నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రామ్ అసిస్టెంట్ బుర్రా సీతారాం ఏకతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్.మధుసూదనరావు, జె.శ్రీనివాసులు, యునెస్కో క్లబ్ ఆఫ్ గుంటూరు ఆర్.పరమేశ్వరరావు పాల్గొన్నారు.



ర్యాలీలో విద్యార్థులతో కృష్ణప్రసాద్, రధినీచౌదరి



నెహ్రూ యువకేంద్రం.. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



టీజేపీఎస్‌లో.. పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

స్ఫూర్తి దాయకం..

గుంటూరు ఎడ్యుకేషన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ ధైర్య, సాహసాలు యువతరానికి స్ఫూర్తి దాయకమని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ భాను మురళీధర్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో క్యాన్సర్‌కు ఆధునిక వైద్యం

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ కేంద్రంలో అంతర్జాతీయ స్థాయిలో వైద్యం అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల సందర్భంగా చలపతి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ మహిళలను కబలిస్తున్నప్పటికీ చక్కని వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన లేకపోవడం వలన ఆసుపత్రులకు ఆలస్యంగా వస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది మహిళలు భయపడటం, బయట చెప్పుకోలేక పోవడం వలన సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. వైద్యులు ప్రాథమికంగా వ్యాధి నిర్ధారణ చేసి వైద్యం అందిస్తే విముక్తి పొందవచ్చన్నారు. ప్రతి మహిళా రొమ్ము క్యాన్సర్ ఉందా లేదా అని తెలుసుకునేందుకు స్క్రీనింగ్ పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్ చికిత్స జీజీహెచ్‌లో కిమో థెరపి, రేడియో థెరపి, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. త్వరలో పెట్ స్కాన్ రాబోతున్నట్లు వెల్లడించారు. పెట్ స్కాన్ వల్ల రోగి శరీరంలోని క్యాన్సర్ లక్షణాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరీక్షకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.25 నుంచి రూ.30వేల వరకు తీసుకుంటారని తెలిపారు. క్యాన్సర్ సెంటర్‌కు నూతనంగా 118 పోస్టులు మంజూరు అయినట్లు వెల్లడించారు. క్యాన్సర్ సెంటర్‌కు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి నాట్కో కేంద్రానికి అవసరమైన నిధులను, నియామకాలను చేపట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. ర్యాలీలో క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ దుర్గా ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, డాక్టర్ రామారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, నాట్కో సమన్వయ కర్త యడ్లపాటి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్

నెహ్రూనగర్: ఓటర్ల జాబితా ముసాయిదాపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అభ్యంతరాల స్వీకరణకు నవంబర్ 4,5 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు నగర ఇన్‌చార్జి కమిషనర్ పీవీకే భాస్కర్ తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024, ముసాయిదాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, సూపర్‌వైజర్లతో ప్రత్యేకంగా సమావేశం మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 27న ప్రకటించిన ఓటర్ల ముసాయిదా జాబితాపై నవంబర్ 4,5 తేదీల్లో నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నామన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని డిసెంబర్ 9 లోగా అందించవచ్చన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో బీఎల్‌ఓలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, నగర ప్రజలు తమ ఓటు పరిశీలన, చిరునామా, ఇతర మార్పులు ఉంటే సంబంధిత ఫారాలు పూర్తి చేసి బీఎల్‌ఓకి ఇవ్వవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు అందించవచ్చని తెలిపారు. సమావేశంలో ఏఈఆర్వోలు బి.శ్రీనివాసరావు, కోటయ్య పాల్గొన్నారు.

పాపిరెడ్డికి ఘన సత్కారం



పాపిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జడ్జి స్పందన

పట్నంబజారు: గుంటూరు ఎక్సైజ్ కోర్టు సూపరింటెండెంట్, జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఎస్.పాపిరెడ్డి మంగళవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జడ్జి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై పాపిరెడ్డి దంపతులను సత్కరించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ పాపిరెడ్డి వృత్తిపై క్రమశిక్షణతో పనిచేశారన్నారు. ప్రతి ఒక్కరితో స్నేహంగా మెలిగేవారన్నారు. కోవిడ్ సమయంలో న్యాయ శాఖ ఉద్యోగులకు సేవలందించారని కొనియాడారు. ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జి.స్పందన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావం, నిర్లక్ష్యం లేకుండా పనిచేసిన వ్యక్తి పాపిరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సురేష్, జిల్లా కోర్టు ఏఓ బి.సూరిబాబు, నాజర్ పి.మల్లేశ్వరరావు, అసిస్టెంట్ నాజర్ జ్యోతి పాల్గొన్నారు.

ప్రతిభకు మార్కులు ఒక్కటే కొలమానం కాదు

ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి జిలానీ



విద్యార్థులతో ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి జిలానీ, రఘురాం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లోని ప్రతిభకు మార్కులు ఒక్కటే కొలమానం కాదని ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి ఎంఏక్యూ జిలానీ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన లలితకళా, విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన అన్ని అంశాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం జిలానీ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు చదువు ఒక్కటే సరిపోదని, వికాసంతో కూడిన సంపూర్ణ పరిజ్ఞానం ఉండాలని అన్నారు. ఇందుకు నిదర్శనంగా బాలకుటీర్ యాజమాన్యం విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దుతూ ముందుకు నడిపిస్తోందని పేర్కొన్నారు. సామాజిక సమస్యలను ఎదుర్కొనేందుకు ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం ఉండాలని, అవి విద్యలో భాగంగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి డాక్టర్ మంగాదేవి గారు, సహకార్యదర్శి జయశ్రీ, సీఏఓ రఘురాం, ప్రిన్సిపాల్ సుధామాధవి పాల్గొన్నారు.

ఉద్యోగులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

సీజీఎస్‌టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



రక్తదానం చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహారెడ్డి

పాత గుంటూరు: ఉద్యోగులు తమ ఉద్యోగ బాధ్యతలతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సెంట్రల్ జీఎస్‌టీ, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. నగరంపాలెంలోని రెడ్ క్రాస్ భవనంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని సెంట్రల్ టాక్స్, కస్టమ్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ విశాఖపట్నం నుంచి వర్చువల్ విధానంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. నరసింహారెడ్డి సేవా కార్యక్రమాలను నిర్వహించటాన్ని ప్రశంసించారు. కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసమే ఈ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- **రక్తదాన శిబిరం**

తుమ్మలపాలెం(ప్రత్తిపాడు): స్థానిక మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, గుంటూరు సీజీఎస్టీ, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారి కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మేడూరి భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.గోపికృష్ణ పర్యవేక్షణలో 107 మంది రక్తదానం చేశారు.